# టిడ్కో గృహాల్లో సమస్యల తిష్ట

- పైపులైన్‌లు పగిలిపోయి దుర్వాసన
- దోమలతో లబ్ధిదారుల బెంబేలు


టిడ్కో గృహాల పైపులు పగిలిపోయి నీరు గారపట్టిన దృశ్యం


టిడ్కో గృహాల సముదాయం


సింక్‌లపై మూతలు లేచిపోయి మురుగునీరు బయటకు పొర్లుతున్న దృశ్యం

**పాలకొల్లు అర్బన్:** పట్టణ సమీపంలోని పెంకుళ్లపాడులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో సమస్యలు తిష్టవేశాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 6144 మంది లబ్ధిదారులకు గానూ రెండు విడతలుగా 2560 మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాల ఫ్లాట్‌లను అప్పగించారు. అయితే 2014–19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఫ్లాట్‌లకు నాసిరకం పైపులు వినియోగించారు. దీంతో పైపులు పగిలిపోయి మురుగునీరు లీకై దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసనతో ఇక్కడి నివసించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు సింక్‌లు నిండిపోయి మురుగునీరు డ్రెయిన్‌లోకి పారడం లేదు. అలాగే చాలాచోట్ల శ్లాబులు పగిలిపోయి నీరు లీకవుతోంది. అలాగే బాత్‌రూమ్‌లో నీరు పక్కనే ఉంటున్న మరో ఫ్లాట్‌లోకి లీకైపోతున్నాయి.

**సొంతింటి వారిపై అద్దెకు వచ్చినవారి పెత్తనం**

టిడ్కో గృహాలను కొంతమంది లబ్ధిదారులు అద్దెకిచ్చారు. దీంతో సొంతింటి వారిపై అద్దెకు వచ్చిన వారు పెత్తనం చేస్తున్నారు. ఫ్లాట్ నిర్వహణ ఛార్జీలు చెల్లించడం లేదు. అంతేకాకుండా నీరు లీకవ్వడం వల్ల తరచూ అద్దెకు ఉంటున్న వారు సొంతింటివారిపై తగాదాలు పడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెత్తకుప్పలు పెరిగిపోవడంతో విష సర్పాలు తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. అలాగే దోమలు విపరీతంగా పెరిగిపోయి రాత్రిళ్లు కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. దోమలతో వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**గంజాయి మూకల ఆగడాలు**

టిడ్కో గృహాల సముదాయాల్లో కొంత మంది ఆకతాయిలు గంజాయి సేవిస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఆడపిల్లలను అల్లరి పెడుతున్నారని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. వీరి వల్ల అత్యవసర సమయాల్లో బయటకు వెళ్లాలంటే భయమేస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించిన సమస్యలను పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

### రూ.2 వేలు ఖర్చు పెడుతున్నాం



గత మూడు సంవత్సరాల నుంచి టిడ్కో గృహాల సముదాయంలో ఉంటున్నాం. సింక్‌లో నీరు తరచూ నిండిపోతుంది. దీంతో మురుగునీరు లాగక ఫ్లాట్‌లోని గదిల్లోకి నీరు లీకవుతోంది. రూ.2 వేలు ఖర్చు పెట్టుకుని పారిశుద్ధ్య కార్మికులను రప్పించుకుని శుభ్రం చేసుకుంటున్నాం. అలాగే ట్యాంకరు సమయాలు పాటించడం లేదు. ఏ సమయంలో ట్యాంకరు వస్తుందో? తెలియడం లేదు.

– కాసా విజయ దుర్గాభవాని, పెంకుళ్లపాడు

## వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగన్నకు అభినందనలు


పిల్లి నాగన్న

**పోడూరు:** వైఎస్సార్ సీపీ పోడూరు మండలకన్వీనర్‌గా మూడోసారి నియమితులైన పిల్లి నాగన్నకు మండలానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తనను మూడో సారి మండల కన్వీనర్‌గా నియమించడం పట్ల సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజుకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజుకు శనివారం నాగన్న కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో మండల కన్వీనర్‌గా పార్టీ బలోపేతానికి కార్యకర్తలతో కలిసి కృషి చేస్తానని నాగన్న చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళిసాగర్, పార్టీ నాయకులు చేకూరి సూరిబాబు, పోతుమూడి రామచంద్రరావు, విప్పర్తి ప్రభాకరరావు, పైడి ఏసుబాబు, పోడూరి సత్యసాయిబాబా తదితరులు నాగన్నకు అభినందనలు తెలిపారు.

## సదరం క్యాంప్‌లు వాయిదా

**పెనుగొండ:** వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాలతో సదరం క్యాంప్‌లను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఆచంట పీహెచ్‌సీ సూపరింటెండెంట్ నిమ్మల రమ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. సదరం ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి విచారణ జరుగుతున్న దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ సదరం క్యాంప్‌లు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. త్వరలో క్యాంప్ వివరాలు ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

## క్లుప్తంగా

### వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



**నరసాపురం రూరల్:** పవిత్ర ధనుర్మాసం సందర్భంగా శనివారం మండలంలోని వేములదీవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పులగం, పాయసం, దద్దోజనం వంటి నైవేద్యాలను సమర్పించారు. ధనుర్మాసం కావడంతో ఉదయం ఆలయ అర్చకులు పాశురం చదివి ఉపన్యాసం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

### విజేతలకు బహుమతులు అందజేత


విజేతలకు బహుమతులు అందజేస్తున్న రోటరీ కార్యవర్గ సభ్యులు

**పాలకొల్లు అర్బన్:** విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించాలని ఎంఈఓ ఆర్ఎన్‌వీఎస్ గంగాధర శర్మ అన్నారు. రోటరీ యూత్ సర్వీస్ క్రీడా పోటీల్లో భాగంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు జ్ఞాపక శక్తి, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలను ఉల్లంపర్రు మాంటిస్సోరీ స్కూల్‌లో నిర్వహించారు. ఎంఈఓ శర్మ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్, రోటరీ యూత్ సర్వీస్ డైరెక్టర్ మద్దాల వాసు, క్లబ్ కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, క్లబ్ మాజీ అధ్యక్షుడు పీబీవీ సుబ్బరాజు (నాని) పాల్గొన్నారు.

### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి


మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

**పాలకొల్లు అర్బన్:** ఆర్థిక సంస్కరణలు అమలు చేసి దేశాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మన్మోహన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గాంధీభవన్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కె.హరికిరణ్, అర్జునరావు, బోనం వెంకట్రావు, షేక్ మహబూబ్ బాషా, వై.నామగిరి, వర్ధనపు కాసు పాల్గొన్నారు.

### రేపు చెత్తను వేరు చేసే కేంద్రం ప్రారంభం

**నరసాపురం:** స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలోని ప్రాంగణంలో తడి, పొడి చెత్తను వేరు చేసే కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

### సీఎస్సీ వెబ్‌సైట్ సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలి

**భీమవరం:** ఉపాధ్యాయుల సర్వీస్ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడానికి, సరి చేసుకోడానికి ఏర్పాటు చేసిన సీఎస్సీ వెబ్‌సైట్–టిఐఎస్ సర్వర్ సామర్థ్యాన్ని పెంచాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు జి ప్రకాశం, బివి నారాయణ శనివారం ఒక ప్రటనలో విద్యాశాఖాధికారులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులంతా ఒకేసారి ఆన్‌లైన్ నమోదుకు సన్నద్ధం కావడం వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల విద్యాశాఖ జిల్లావారి టైంలైన్‌తో టీఐఎస్ సర్వర్స్ ద్వారా నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**ఉండి:** మండలంలోని యండగండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గణపవరం మండలం అప్పనవీడు గ్రామానికి చెందిన సింగిడి పవన్ కుమార్ గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాధితుడు ఈ నెల 26న భీమవరంలో వెళ్లి వస్తుండగా యండగండిలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించిగా మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి నుంచి అందిన సమాచారం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు.

## బీసీలు రాజకీయ రిజర్వేషన్లు సాధించుకోవాలి


పాశర్ల మాదవ్ ఆదినారాయణను అభినందిస్తున్న బీసీ నాయకులు

**పాలకొల్లు అర్బన్:** బీసీలు రాజకీయ రిజర్వేషన్లు సాధించుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటాలు చేయడానికి సిద్ధం కావాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ముద్దాడ గణేష్‌భవాని పిలుపు నిచ్చారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన జాతీయ బీసీ సంక్షేమ సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రేవు శ్రీనివాస్ మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పాలకొల్లు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడిగా పాశర్ల మాధవ్ ఆదినారాయణను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు పొన్నమండ ముత్యాలరావు, కోరుకొండ సుబ్బారావు, నీలంశెట్టి సత్యప్రసాద్, మామిడిశెట్టి చిట్టిబాబు, గబ్బిడి నరసింహరాజు (స్వామి) తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీల పెంపు దారుణం


గుమ్మలూరులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

**పోడూరు:** విద్యుత్ చార్జీల పెంపు దారుణమని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శనివారం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ గుమ్మలూరు గ్రామంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు శనివారం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కాకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యుత్ ఛార్జీలతో ప్రజలపై రూ.15 వేల కోట్ల భారాన్ని మోపిందనీ, విద్యుత్ బిల్లులను చెల్లించకుండా ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేయాలని ఎన్నికలకు ముందు చెప్పిన టీడీపీ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు పూనుకోవడం చాలా దారుణమని వెంకటేశ్వరరావు ఖండించారు. విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పిల్లి ప్రసాద్, రాపాక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ ఎనర్జీపై స్వర్ణాంధ్రలో ముగిసిన వర్క్‌షాప్


డాక్టర్ వియల్‌యన్ శాస్త్రిని అభినందిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం

**నరసాపురం రూరల్:** సోలార్ వ్యవస్థ సూర్యుడి నుంచి వచ్చే రేడియంట్ శక్తిని ఉపయోగించి పరోక్షంగా శక్తిని ఉత్పత్తి చేస్తుందని తద్వారా వేడి, విద్యుత్ ఉత్పత్తి అవుతుందని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఆంధ్రప్రదేశ్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ వియల్‌యన్ శాస్త్రి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న సోలార్ ఎనర్జీ పై వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సోలార్ ప్యానల్స్, సోలార్ సెల్ డిజైన్, వాటి వివిధ కంట్రోల్ పద్ధతులు తదితర అంశాలపై అవగాహనను కల్పించారు. అనంతరం వియల్‌యన్ శాస్త్రిని కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ గోపిచంద్ పాల్గొన్నారు.

## హోటళ్లలో మున్సిపల్ అధికారుల తనిఖీలు


తనిఖీ చేస్తున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

**భీమవరం(ప్రకాశం చౌక్):** భీమవరంలో పలు హోటళ్లను మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి శనివారం తనిఖీ చేశారు. ముందుగా ఉండి రోడ్డులోని విజయమెస్‌ను ఆయన తనిఖీ చేశారు. విజయమెస్‌లో అపరిశుభ్ర వాతావరణంలో వంటలు తయారు చేయడం, రంగు పదార్థాలతో ఆహారం తయారు చేయడం కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసి, హోటల్‌కు జరిమానా విధించి మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## నరసాపురం వైఎస్సార్ సీపీ రథసారథులు వీరే


కామన బాల సత్యనారాయణ


ఉంగరాల రమేష్


రేవు నారాయణరాజు


ఏడిద కోట సత్యనారాయణ


పప్పుల రామారావు


ముసూడి రత్నం


దేవ రంజిత్‌కుమార్


పాలా రాంబాబు

**నరసాపురం:** నరసాపురం వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం నెలకొంది. పార్టీ జిల్లా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తరువాత ముదునూరి ప్రసాదరాజు పార్టీ జిల్లా, పట్టణ, మండల కమిటీలు కొత్తగా నియమించారు. ఈ నియామకాల్లో నరసాపురం నియోజకవర్గం నుంచి పలువురు సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో పార్టీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీ నరసాపురం పట్టణ అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది, రాజకీయ కుటుంబానికి చెందిన కామన బాలసత్యనారాయణ(బుజ్జి) నియమించారు. కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్‌కు సమీప బంధువైన బుజ్జి కుటుంబానికి కాంగ్రెస్‌పార్టీతో మంచి సంబంధం ఉంది. ఆయన తండ్రి కాంగ్రెస్‌వాదిగా ముద్రపడ్డారు. మొదట కాంగ్రెస్‌లో పనిచేసిన కామన బుజ్జి వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. ఆయన సతీమణి నాగిని మున్సిపల్ వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రస్తుత వైస్ ఎంపీపీగా ఉన్న ఉంగరాల రమేష్‌ను నియమించారు. అలాగే మొగల్తూరు మండల అధ్యక్షుడిగా మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన రేవు నారాయణరాజును నియమించారు.

**జిల్లా కమిటీలో నియోజకవర్గ నేతలకు ప్రాధాన్యం**

జిల్లా కమిటీలో పార్టీ సీనియర్ నేతలకు ప్రాధాన్యం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో దీర్ఘకాలం పనిచేసి, పలుమార్లు కౌన్సిలర్‌గా పనిచేసిన ఏడిద కోటసత్యనారాయణ(వైకేఎస్)ను జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. దివంగత వైఎస్సార్‌తో సైతం మంచి అనుబంధం ఉన్న వైకేఎస్ ప్రస్తుతం మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ తరఫున పని చేస్తున్నారు. ఇక జిల్లా ఉపాధ్యక్షుడిగా మరో సీనియర్ నేత, న్యాయవాది పప్పుల రామారావును నియమించారు. మంచి వక్తగా, పార్టీ సీనియర్ నేతగా రామారావుకు పేరుంది. జిల్లా మరో అధికార ప్రతినిధిగా బూసరపు జయ, జిల్లా ప్రధాన కార్యదర్శులుగా ప్రముఖ న్యాయవాది దేవ రంజిత్‌కుమార్, పాలా రాంబాబులను నియమించారు. జిల్లా కార్యదర్శులుగా కడలి రాంబాబు, తిరుమాని కృష్ణంరాజులను నియమించారు. ఇక నియోజకవర్గంలో ఎస్సీ,ఎస్టీ వర్గాల్లో మంచి పేరున్న ముసూడి రత్నాన్ని జిల్లా ఆర్గనైజింగ్ కార్యాదర్శిగా నియమించారు. పదవులు పొందిన నేతలు ముదునూరిని కలిసి కతజ్ఞతలు చెప్పారు.

## ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని వినతి


రాఘవులుకు వినతిపత్రం ఇస్తున్న ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న

**నరసాపురం:** జాతీయ స్థాయిలో సంచార జాతులకు ప్రత్యేక రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం కల్పించే విధంగా చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలని సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులును కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల నిమిత్తం నరసాపురం వచ్చిన రాఘవులతో వీరన్న అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో సమావేశమాయ్యారు. సంచార జాతులకు జాతీయ స్థాయిలో ప్రత్యేక రిజర్వేషన్ కల్పించే విధంగా ఈ అంశాన్ని రాజ్యాంగంలో చేర్చాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు వీరన్న వివరించారు. ఇదేమీ కొత్త డిమాండ్ కాదని, గతంలో నియమించిన కమిషన్‌లు సంచార జాతుల వారికి ప్రత్యేక రిజర్వేషన్‌లు కల్పించాలని సూచించాయని, వాటిని అమలు చేసే విధంగా మద్దతు ఇవ్వాలని కోరారు. 1956–61 సంవత్సరాల మధ్యకాలంలో వెన్నెలకంటి రాఘవయ్య ఇచ్చిన రిపోర్ట్ మేరకు సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారని చెప్పారు. ప్రస్తుతం సంచార జాతుల పరిస్థితిని రాఘవులుకు వివరించి వినతిపత్రం ఇచ్చారు. రాఘవులు తమ డమాండ్లకు రాఘవులు సానుకూలంగా స్పందించి దీనిపై జాతీయ స్థాయిలో చర్చకు సహకరిస్తానని చెప్పినట్టు వీరన్న పేర్కొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కవిటంలో క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు వినోద్‌శర్మను సత్కరిస్తున్న దృశ్యం

**పెనుగొండ:** ప్రపంచ శాంతి, ప్రేమను చాటి చెప్పడానికి జనించిన క్రీస్తు జననానికి సంబంధించి ఎన్నో రుజువులు ఉన్నాయని వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు నక్క వినోద్ శర్మ అన్నారు. పోడూరు మండలం పాస్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కవిటం ఫిలదెల్ఫియా బైబిల్ ఇన్స్టిట్యూట్ చర్చిలో శనివారం క్రిస్మస్ వేడుకలు సంఘ ప్రధాన కార్యదర్శి బిషప్ సీహెచ్ విజయబాబు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. రెవ డాక్టర్ టీఎస్ ఆర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ క్రీస్తు బాటలో సమాజాభివృద్ధికి పాటు పడాలని కోరారు. సమావేశంలో వినోద్ శర్మను పాస్టర్లు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ శాశ్వత గౌరవ అధ్యక్షుడిగా ప్రసాద్ రెడ్డిని ఎన్నుకున్నారు. పి.నాగభూషణం, పి.రాజేంద్ర ప్రసాద్, సీహెచ్ మోసే తదితరులు పాల్గొన్నారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు అర్బన్:** ఏసుక్రీస్తు జననం ప్రపంచానికి వెలుగుగా మారిందని, అలాగే ఆయనలోని ప్రేమ, దయ ,త్యాగ గుణాలు ప్రజలందరికీ ఆదర్శం కావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాలకొల్లులో మంత్రి కార్యాలయ ఆవరణలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని పాస్టర్లందరికీ నూతన వస్త్రాలు బహూకరించారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, ఆర్డీఓ దాసి రాజు, డీఎస్పీ డా.శ్రీవేద, మునిసిపల్ కమిషనర్ బి.విజయ సారథి, తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ పాల్గొన్నారు.

### 3న కలెక్టరేట్‌కు రావాలని రైతులకు నోటీసులు

**ఆకివీడు:** జాతీయరహదారి నంబర్ 165కు ఉప్పుటేరు వద్ద నుంచి అజ్జమూరు గరువు వరకూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూమి సేకరణకు సంబంధించి రికార్డు దఖలపరిచేందుకు జనవరి 3న భీమవరం కలెక్టర్ కార్యాలయంలో హాజరుకావాలని సంబంధిత భూమి యజమానులకు నోటీసులు జారీ చేశారు. మండలంలోని దుంపగడప, ఆకివీడు, అజ్జమూరు గ్రామాల్లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలోని భూమిని జాతీయ రహదారుల అథారిటీ సేకరించేందుకు గతంలోనే నిర్ణయం తీసుకున్నారు. భూమి విలువల్లో తేడాలు వల్ల ఆయా ప్రాంతాల్లోని రైతులు కోర్టుకు వెళ్లడంతో కొంత జాప్యం జరిగింది. కోర్టు ఆదేశాల అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా భూమి యజమానులు, కొనుగోలుదారులు సుమారు 87 మందికి నోటీసులు జారీ చేశారు. తమ వద్ద ఉన్న దస్తావేజులు, ఇతర రికార్డులను కలెక్టర్ కార్యాలయంకు తీసుకురావాలని సూచించారు.

## భూ సమస్యలకు 45 రోజుల్లో పరిష్కారం


పోడూరు: వేడంగిలో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్


యలమంచిలి: ఏనుగువానిలంకలో మాట్లాడుతున్న తహసీల్దార్ పవన్‌కుమార్

**పోడూరు:** రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని స్థానిక తహసీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ చెప్పారు. వేడంగి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ ఫాజిల్ మాట్లాడుతూ తమ పంటభూములకు సంబంధించి రికార్డుల పరంగా సమస్యలున్న రైతులు రెవిన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదస్సులో రైతుల నుండి అధికారులకు 4 అర్జీలు అందాయని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లబోయిన శారద, ఆర్ఐ కందుల రాంబాబు పాల్గొన్నారు.

**మొగల్తూరులో..**

**మొగల్తూరు:** గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆరు వినతులు అందాయని తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. మండలంలోని కాళీపట్నం తూర్పు, పడమర గ్రామాల్లో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతులు అందించిన వినతులను పరిశీలించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాళీపట్నం తూర్పు గ్రామంలో 22 మంది రైతులు రెండు వినతులు, పడమర గ్రామంలో 30 మంది రైతులు 6 వినతులు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు మేడిది సౌజన్య, కవురు సావిత్రి, వైస్ ఎంపీపీ కవురు సీతామహలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు తణుకుల శ్రీవెంకట దుర్గ, మండల సర్వేయర్ దస్‌రాజ్, ఆర్ఐ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

**ఏనుగువానిలంకలో..**

**యలమంచిలి:** రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదికని, వీటిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గ్రంధి జీఎన్‌వీ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఏనుగువానిలంక పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పట్టాదార్ పాస్‌పుస్తకం కోసం 11, రీప్లేస్‌మెంట్ పాస్ పుస్తకం కోసం 8, అడంగల్ కరెక్షన్ 1 అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈద ప్రమీల, ఎంపీటీసీ సభ్యురాలు ఇనుకొండ ధనలక్ష్మి, వీఆర్‌ఓ కె.రమేష్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని బాడవలో డిప్యూటీ తహసిల్దార్ పి డేవిడ్‌సన్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలపై ఆరుగురు అర్జీలు అందజేశారు. సర్పంచ్ రాయి వీరవెంకట దుర్గ, ఎంపీటీసీ సభ్యుడు ఇంటి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.